క్లుప్తంగా

ఎమ్మెల్యే టికెట్ ఆదివాసీలకే ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: ఎమ్మెల్యే టికెట్ ఆదివాసీలకే ఇవ్వాలని ఆదివాసీసేన మండల అధ్యక్షుడు సిడం కైలాస్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్ ఆదివాసీలకే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జంగు, భీంరావు, సోము తదితరులు ఉన్నారు.

ఆందోళన కార్యక్రమాలు విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: దేశంలో మీడియా రక్షణ చట్టాన్ని అమలు చేసి మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిమాండ్లు నెరవేర్చాలని ఇండియా జర్నలిస్టు యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు గాంధీ జయంతి పురస్కరించుకొని జర్నలిస్టులు జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో ఆందోళన కార్యక్రమాలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పదవీ విరమణ పొందిన ఉద్యోగికి సన్మానం

కాగజ్‌నగర్‌రూరల్: తాను విద్యుత్ శాఖలో చేసిన సేవలు సంతృప్తినిచ్చాయని విద్యుత్ శాఖ డీఈఈ కేవీ రాజశేఖర్‌రావు అన్నారు. ఆయన పదవీ విరమణ పొందిన సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఈ నాగరాజు, ఏడీఏ శ్రీనివాస్, కౌటాల ఏడీఈ రాజేశ్వర్, యూనియన్ నాయకులు ఎమ్మాజీ సతీశ్, చంద్రశేఖర్, వెంకటేశ్, రమేశ్, ఇర్ఫాన్, జగన్మోహన్, సంతోశ్, ఇర్ఫాన్, ఆనంద్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో పలువురికి గాయాలు

జైనూర్: లింగాపూర్ మండలంలోని వంజరిగూడలో ఆదివారం సాయంత్రం పిడుగు పడి పలువురికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన రామేశ్వర్, లక్ష్మణ్, కృష్ణ, విద్య, జ్యోతి పంటచేలలో పనులు చేస్తుండగా సమీపంలో పిడుగుపడడంతో గాయాల పాలయ్యారు. 108లో జైనూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించి ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు.

కాంగ్రెస్‌లో చేరిన మజ్లిస్ పార్టీ నాయకులు


కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకు చెందిన మజ్లిస్ పార్టీ నేతలు ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అసిఫ్ అలీ ఆధ్వర్యంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ సమక్షంలో హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు వసంత్ తదితరులు ఉన్నారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం

చింతలమానెపల్లి: మండలంలోని కోర్సిని గ్రామంలో డ్రెయినేజీల నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి ఆదివారం సర్పంచ్ కొడిపే శ్యామల ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప డ్రెయినేజీల నిర్మాణానికి నిధులు కేటాయించారన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

బెస్త సంఘం అభివృద్ధికి కృషి


ప్రొసిడింగ్ కాపీ అందజేస్తున్న ఎమ్మెల్యే

కాగజ్‌నగర్‌రూరల్: బెస్త సంఘం అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. బెజ్జూర్ మండల కేంద్రంలో బెస్త సంఘం భవనం మంజూరు కోసం రూ. 5లక్షలు మంజూరు కాగా, ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో సంఘం నాయకులకు ప్రొసిడింగ్ కాపీ అందజేశారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు బషారత్ ఖాన్, మండల ప్రాథమిక సహకార సంఘం మాజీ చైర్మన్ డోకె వెంకన్న, మండల పార్టీ అధ్యక్షుడు సిడెం సకారం, నాయకులు జాహిద్ హుస్సేన్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

బడుల్లో నాసిరకం పనులు

- మన ఊరు -మన బడి పనుల్లో కరువైన నాణ్యత
- బంబార పాఠశాలలో అధ్వానంగా పనులు
- కరువైన అధికారుల పర్యవేక్షణ


చిచ్చుపల్లి పాఠశాలలో అసంపూర్తిగా పనులు


బంబార పాఠశాలలో నల్లాల వద్ద పేరుకుపోయిన నాచు

వాంకిడి: ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్ది, సకల సౌకర్యాలతో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు -మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దశల వారీగా ప్రభుత్వ బడులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కార్యచరణ చేపట్టింది. మొదటి విడతలో మండలంలోని 23 పాఠశాలలను అధికారులు ఇందుకు ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల ఆధునీకరణకు నిధులు కేటాయించారు. గతేడాది పనులు ప్రారంభించినా ఇప్పటివరకు కేవలం మూడు పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం చేపడుతున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని విమర్శలు విన్పిస్తున్నాయి. సంబంధిత అధికారులు వాటాలు తీసుకొని పనులను కాంట్రాక్టర్ ఇష్టానికి వదిలేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఇష్టారాజ్యంగా పనులు..

మండలంలోని బంబార ప్రాథమిక పాఠశాలలో మేజర్, మైనర్ రిపేర్లతో పాటు ప్రహరీ, వంట గది, తాగునీటి సంపు, విద్యుత్ పరికరాల ఏర్పాటు, పెయింటింగ్, హ్యాండ్‌వాష్, టాయిలెట్స్ వంటి పనులకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి. ఇందులో కొన్ని పనులకు ఉపాధిహామీ నిధులు కేటాయించారు. ప్రారంభానికి సిద్ధంగా ఆ పాఠశాలలో చేపట్టిన పనులు నాసిరకంగా, ఇష్టారాజ్యంగా చేసినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తాగునీటి నల్లాలు, హ్యాండ్‌వాష్ కోసం నిర్మించిన వాష్ బేసిన్ నిర్మాణం అడ్డగోలుగా చేపట్టడంతో వృథా నీరు ఎటూ వెళ్లలేని పరిస్థితి ఉంది. మధ్యాహ్న భోజనం అనంతరం విద్యార్థులు ప్లేట్లు కడిగిన నీరంతా పాఠశాల ఆవరణలో నిల్వ ఉంటుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పనులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సెలవుల్లో ఉన్న రోజుల్లో చేపట్టారని, సంబంధిత ఇంజినీరింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

నత్తనడకన పనులు..

మన ఊరు -మన బడిలో భాగంగా మండలం నుంచి 23 పాఠశాలలు ఎంపిక కాగా ఇప్పటికి కేవలం మూడు పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. కొన్ని పాఠశాలల్లో ప్రారంభించిన పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నచందంగా మారాయి. పనుల్లో నాసిరకమైన సిమెంట్ వినియోగిస్తున్నారన్న ఆరోపణలు సైతం విన్పిస్తున్నాయి. చిచ్చుపల్లి పాఠశాలలో నీటి సంపు, తాగునీటి నల్లాలు, ప్రహరి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. మేజర్, మైనర్ రిపేర్లు ప్రారంభం కూడా కాలేదు. ఆర్లి, నవేదరి పాఠశాలల్లో నీటి వసతి లేక సంపు, నల్లాలు నిరుపయోగంగా మారాయి. నాసిరకం నాణ్యత ప్రమాణాలపై సంబంధిత ఇంజినీరింగ్ అధికారి కిరణ్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

జారి పడుతున్నాం..



చేతులు కడుక్కునేందుకు వెళ్లే సమయంలో జారి పడుతున్నాం. చేతులు, ప్లేట్లు కడిగిన నీరు పాఠశాల ఆవరణలో నిల్వ ఉంటున్నాయి. దీంతో నాచు తయారైంది. ప్రతీరోజు ఎవరో ఒకరు జారి పడుతున్నారు.

– రాజేశ్వరి, 5వ తరగతి, బంబార పాఠశాల

పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం

మన ఊరు -మన బడి పనులు చేపట్టిన గుత్తేదారులకు త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశాం. పనుల్లో జాప్యం జరగకుండా చూస్తాం. ఎక్కడైనా నాసిరకంగా పనులు చేపడితే ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

– మనుకుమార్, ఎంఈవో, వాంకిడి

భగీరథ నీళ్లు బంద్!

- పైపులైన్ లీకేజీకి మరమ్మతులు
- ఇబ్బందులు పడుతున్న నాలుగు మండలాల ప్రజలు
- నీటి కోసం బోర్లు, బావులే దిక్కు
- మరో రెండు రోజులపాటు సరఫరా నిలిపివేత


మరమ్మతులు చేస్తున్న అధికారులు

కౌటాల: మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన తాగు నీరు ప్రతీ గ్రామానికి సరఫరా చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. నిత్యం ఏదో ఒక సమస్యతో మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోతోంది. మరమ్మతులు, మోటార్ల రిపేర్లతో నీళ్లు రాక గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆసిఫాబాద్ జిల్లాలోని అడ ప్రాజెక్టు వద్ద వాటర్‌గ్రిడ్ ఏర్పాటు చేసి భగీరథ నీటిని పైప్‌లైన్ ద్వారా జిల్లాలోని పలు గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. కొద్ది రోజుల నుంచి భగీరథ నీటి సరఫరా సాజావుగా సాగకపోవడంతో జిల్లావాసులు అవస్థలు పడుతున్నారు.

నిలిచిన సరఫరా..

మండల కేంద్రంలోని సదాశివపేట కాలనీలో భగీరథ నీటిని సరఫరా చేసే పైపులైన్ లీకేజీ కారణంగా గత నాలుగు రోజుల నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో సిర్పూర్ నియోజకవర్గంలోని కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాలకు నీరు సరఫరా కావడం లేదు. కౌటాల మండలంలోని తలోడి చౌరస్తాలో గల మిషన్ భగీరథ నీటి సరఫరా ప్రధాన పైపులకు మరమ్మతు పనులు చేస్తున్నారు. తలోడి చౌరస్తాలో మిషన్ భగీరథ నీటి లీకేజీ కారణంగా కౌటాల -బెజ్జూర్ ప్రధాన రహదారిపై నీరు పారుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

బోర్లు, బావులే దిక్కు..

జిల్లాలో రూ.కోట్లు వెచ్చించి ప్రారంభించిన మిషన్ భగీరథ పథకం నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో మిషన్ భగీరథ నీటిపై ఆధారపడిన గ్రామీణ వాసులకు తిప్పలు తప్పడం లేదు. అసంపూర్తి పనులు, పైప్‌లైన్లు, లీకేజీలతో పాటు సాంకేతిక సమస్యలతో పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా కావడం లేదనే ఆరోపణలున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీరు రంగు మారి వస్తోంది. భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామాల్లోని చేతిపంపులు, బావుల నీళ్లను ప్రజలు తాగుతున్నారు. అపరిశుభ్ర నీటితో వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో సైతం తాగునీటికి తిప్పలు తప్పడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా పైపులైన్ లీకేజీ మరమ్మతు పనులు కొనసాగుతున్నట్లు మిషన్ భగీరథ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరో రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి ఆయా మండలాలకు నీటిని సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

'ఏరియా ఆసుపత్రి కార్మికులను బదిలీ చేయొద్దు'

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రి సిబ్బందిని గోలేటి టౌన్‌షిప్‌కు బదిలీ చేయవద్దని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సింగరేణి అధికారులను ఆదేశించారు. ఆదివారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మికులు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కార్మికులు గోడు వెళ్లబోసుకోగా స్పందించిన ఎమ్మెల్యే బెల్లంపల్లి ఏరియా జీఎంతో ఫోన్‌లో మాట్లాడారు. ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బంది, కార్మికులను గోలేటి టౌన్‌షిప్‌కు బదిలీ చేయొద్దని జీఎంకు సూచించారు. అవసరమైతే అదనంగా మరికొంత మందిని గోలేటి టౌన్‌షిప్‌కు బదిలీపై రప్పించుకోవాలి తప్పా ఆసుపత్రి నుంచి ఏ ఒక్కరిని బదిలీ చేయరాదని సూచించారు. ఇందుకు జీఎం సానుకూలత వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసనలు


కెరమెరి: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

కెరమెరి: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె ఆదివారం 21వ రోజుకు చేరుకుంది. సీఐటీయూ నాయకుడు కూటికల ఆనంద్, అనసూయ, స్రవంతి, కవిత, గుణసుందరి, కవిత, సింధుబాయి, విమల, అరుణా, సంగీత, మీరాబాయి, మల్లుబాయి సవిత తదితరులు ఉన్నారు.

కౌటాల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి సాయిబాబా ఆలయం వరకు ఆదివారం అంగన్‌వాడీలు సమ్మెలో భాగంగా ర్యాలీ తీశారు. సాయిబాబా ఆలయం వద్ద పొర్లు దండాలు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. సమ్మెలో అంగన్‌వాడీ టీచర్లు జీజాబాయి, జ్యోతి, శ్యామల, సక్కుబాయి, నందుబాయి, యశోద, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు శ్యామ్ నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు చేపడుతున్న నిరవధిక సమ్మెలో స్థానిక పార్టీ నాయకులతో కలిసి మద్దతు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ, నాయకులు హనుమంతు, రమేశ్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి


పెంచికల్‌పేట్: మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నాయకుడు కృష్ణమాచారి

కౌటాల: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం ఎదుట ఆదివారం 4వరోజు మధ్యాహ్న భోజన కార్మికులు నిరవధిక సమ్మె కొనసాగించారు. వారు మాట్లాడుతూ కార్మికులకు పెంచిన వేతనాల చెల్లింపునకు బడ్జెట్ విడుదల చేయాలన్నారు. సమ్మెలో కార్మికులు దుర్గం లక్ష్మి, శారద, తానుబాయి, హంస, పద్మ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: ప్రభుత్వ బడుల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు కృష్ణమాచారి ఆదివారం డిమాండ్ చేశారు. పెంచికల్‌పేట్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న కార్మికులకు మద్దతు తెలిపారు.

ఘనంగా 'స్వచ్ఛత హీ సేవా'


కెరమెరి: మోడి ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన మానవహారం

జైనూర్: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో అవగాహన కార్యక్రమాలతో పాటు పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. ఆదివారం ఆయా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రభుత్వాసుపత్రిని శుభ్రం చేశారు. ఎంపీడీవో ప్రభుదయ, ఏపీవో నగేశ్, ఈవో శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్‌లాలా, బీజేపీ మండల అధ్యక్షుడు దౌలత్ రావు, నాయకులు అజ్జులాలా ఉన్నారు.

ఆసిఫాబాద్ మండలంలో..

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని మోతుగూడ గ్రామంలో స్వచ్ఛత హీ సేవా పక్షోత్సవంలో భాగంగా పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ సువర్ణ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి రాందాస్ పాల్గొన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: మండల కేంద్రంలోని 31 గ్రామ పంచాయతీలలో స్వచ్ఛత హీ సేవా పక్షోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోడి ఆశ్రమ ఉన్నత పాఠశాల ఆవరణలో మానవహారం ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో ప్రజలతో కలిసి శ్రమదానం చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీల కేంద్రాల ఆవరణలను శుభ్రం చేశారు. ఎంపీడీవో మహేందర్, ఈజీఎస్ ఏపీవో మలయ్య, సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

పెంచికల్‌పేట్: మండలంలోని సిద్ధేశ్వర గుట్టల వద్ద స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం అటవీశాఖ రేంజ్ అధికారి వేణుగోపాల్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ కవర్లు, చెత్త తొలగించారు. అటవీ ప్రాంతానికి వచ్చే భక్తులు ప్లాస్టిక్ కవర్లను వెంట తీసుకురావద్దని సూచించారు. అటవీప్రాంతంలోని ప్లాస్టిక్‌తో వన్యప్రాణులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ రేంజ్ అధికారులు ప్రభాకర్, రమాదేవి, అనిమల్ ట్రాకర్లు, యువకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బెజ్జూర్: వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని బెజ్జూర్ ఎఫ్ఆర్‌వో దయాకర్ అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా బెజ్జూర్ రేంజ్ పరిధిలోని మాణిక దేవర అటవీ సమీపంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.


అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఆర్‌వో దయాకర్


పెంచికల్‌పేట్: సిద్ధేశ్వర గుట్ట వద్ద..

వృద్ధులకు ఘన సన్మానం



దహెగాం: వృద్ధులను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

దహెగాం: జాతీయ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మండల కేంద్రానికి చెందిన 82 సంవత్సరాలు పైబడిన వృద్ధులను ఘనంగా సన్మానించారు. ఆర్ఐలు నాందేవ్, శృతిల ఆధ్వర్యంలో సన్మానించారు.

కెరమెరి: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంతో పాటు 31 గ్రామపంచాయతీల్లో 29 పోలింగ్ బూత్ కేంద్రాల్లో ఆదివారం సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించినట్లు రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రవణ్‌కుమార్, సిబ్బంది సేవంతా, సిద్దార్థ, వివేక్, బీఎల్‌వోలు ఉన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఆరె కుల సంఘ భవనంలో ఆదివారం తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 90 సంవత్సరాలు దాటిన వారికి సేవలు చేస్తున్న కుటుంబ సభ్యులను సన్మానించారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు పూర్ణచందర్‌రావు, మండలాధ్యక్షుడు ఎల్లాగౌడ్, బంగారుబాబు, సాంబశివుడు, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది మండలంలోని వయోవృద్ధులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో డీటీ దిలీప్, జూనియర్ అసిస్టెంట్లు నారాయణ పాల్గొన్నారు.


కెరమెరిలో..


కౌటాలలో..

మంచిర్యాల బస్‌డిపో మేనేజర్‌కు వినతి

తిర్యాణి(ఆసిఫాబాద్): మంచిర్యాల డిపో నుంచి నడిపే ఆర్టీసీ బస్సు సౌకర్యం మరింత మెరుగుపర్చాలని ఆదివారం తిర్యాణి మండల ప్రజాప్రతినిధులు ఆదివారం డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. మంచిర్యాల నుంచి తిర్యాణి వరకు వచ్చే బస్సును యథావిధిగా కుమురంభీం చౌరస్తా నుంచి సుంగాపూర్ వరకు పొడిగించాలని కోరారు. వారానికి ఒకసారి సుంగాపూర్ నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేకంగా సూపర్ లగ్జరీ నడపాలన్నారు. ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుణవంత్‌రావు, సర్పంచులు బాదిరావు, గణపతి, సుజాత ఉన్నారు.

గిరిజన విద్యార్థులు సత్తా చాటాలి

ఉట్నూర్‌రూరల్: ఉన్నత విద్యలో గిరిజన విద్యార్థులు సత్తా చాటాలని ఉట్నూర్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ ఆశ్రమ బాలికల పాఠశాలలో మైడ్రీమ్స్ కంట్రూ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన హ్యాపీ జిందగీ మోటివేషనల్ అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. మహనీయులను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. సొసైటీ అధ్యక్షుడు సాయికృష్ణ, ప్రధానోపాధ్యాయులు మాణిక్‌రావు, లెక్చరర్ మాదాసు మధుకర్ పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టి 'ఆశ'ల నిరసన


కెరమెరి: నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

కెరమెరి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న ఆశ వర్కర్ల సమ్మె ఆదివారం ఏడో రోజుకు చేరింది. కళ్లకు గంతలు కట్టి నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకులు ఆనంద్, ఆశ కార్యకర్తలు అరుణ, భారతి, సావిత్రి, దుర్పత, నీలాబాయి, లక్ష్మి, లలిత, సరోజా తదితరులు ఉన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశ వర్కర్లు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ ఆశ వర్కర్లకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మ, నాయకులు పంచశీల, పద్మ, అనిత, గౌరుబాయి, భాగ్య, మాధవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: తమ డిమాండ్లు నెరవేర్చాలని కలెక్టరేట్ ఎదుట ఆదివారం ఆశ కార్యకర్తలు కళ్లకు నల్లగంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు స్వరూప, ఆశ వర్కర్లు లలిత, యశోద, రమా, రజిత, సుమిత్ర, కవిత తదితరులు ఉన్నారు.

కౌటాల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివారం ఆశల నిరవధిక సమ్మె కొనసాగింది. ఆశ వర్కర్లు లక్ష్మి, కాంత, సుజాత, నిర్మల, విజయ, తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్లు అందజేత

లక్సెట్టిపేట: మండలంలోని శ్రీ శివసాయి గణేశ్‌సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన మాలతి, పోతపల్లి గ్రామానికి చెందిన తిరుమలకు కుట్టు మిషన్లు అందజేశారు. పేద మహిళలు జీవనోపాధి పొందేందుకు కుట్టు మిషన్లు అందించినట్లు సభ్యులు తెలిపారు.